క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ

బత్తలపల్లి: లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయించాలని మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీదేవి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌తో కలిసి ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. మండలంలో వివిధ స్కీంల కింద నిర్మాణంలో ఉన్న ఇళ్ల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో జాప్యం వద్దు



జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి: ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం వద్దని బుక్కపట్నం మండల ప్రత్యేకాధికారి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అగ్రహారం, గూనిపల్లిలోని సచివాలయం, రైతుభరోసా కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. వేరుశనగ విత్తన పంపిణీని పరిశీలించి రైతులకు నాణ్యమైన కాయలను పంపిణీ చేయాలన్నారు. అలాగే గణికవారిపల్లి, పాముదర్తి, గూనిపల్లిలో జగనన్న లే అవుట్లను తనిఖీ చేశారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అర్హత కలిగిన వారందరికీ ఇళ్లను మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



విద్యార్థుల డ్రాయింగ్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

గాండ్లపెంట: స్థానిక శాఖ గ్రంథాలయాన్ని శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. సెలవుల్లో ఏం నేర్చుకున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కథలు చదివించారు. వారు వేసిన డ్రాయింగ్స్, పేపర్ కటింగ్స్‌ను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి ఫరియాబాను పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు

కదిరి టౌన్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిష్టించి 30 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, 8:30 గంటలకు అమ్మవారి ప్రాకారోత్సవం, సాయంత్రం 5.30 గంటలకు పుష్పయాగోత్సవం నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు విశేష నక్షత్ర పంచ హారతుల అనంతరం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కదిరి ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఖాద్రీ ఆలయ ఈఓగా శ్రీనివాసరెడ్డి



కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారి (ఈఓ)గా శుక్రవారం వెండిదండి శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న పట్టెం గురుప్రసాద్ విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో నెల్లూరు జిల్లా శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈఓగా పని చేస్తున్న వెండిదండి శ్రీనివాసరెడ్డి కదిరి ఈఓగా బదిలీ అయ్యారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆలయ ప్రారంభోత్సవాలు ప్రారంభం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని గంగిరెడ్డిపల్లి చెరువు కట్టపై వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. తొలి రోజు ధ్వజ స్తంభం వద్ద పూజలు చేపట్టారు. కోలాటం, చెక్క భజన తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఆల్‌ఫ్రీ బాబును నమ్మొద్దు

- హామీలతో మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నాలు
- చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పీవీ సిద్దారెడ్డి



ప్రభుత్వ పాలనపై అభిప్రాయం తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



మాచిరెడ్డిపల్లిలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ధర్మవరం: ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారిగా ఉండి సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 15వ వార్డు నేసేపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. రోడ్డుకు అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఎమ్మెల్యేకు తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. ట్రాన్స్‌ఫార్మర్‌ను సమీపంలోని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఏఈ నాగభూషణను ఆదేశించారు. మరికొంత మంది సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందలేదని విన్నవించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడిన ఎమ్మెల్యే.. వెంటనే సమస్యలు పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను 98 శాతం వరకు అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు.

హామీలతో బాబు డ్రామా..

ఎన్నికల్లో గెలిచేందుకు మోసపూరిత హామీలతో చంద్రబాబు నాయుడు మళ్లీ డ్రామాకు తెరలేపుతున్నారన్నారు. ఆల్‌ఫ్రీ బాబుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చంద్రబాబు నాయుడు మహానాడులో ఇచ్చిన హామీలను చూస్తే అధికారం కోసం ఎంత దిగజారుతున్నారో అర్థం అవుతుందన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలకు అందాల్సిన సంక్షేమాన్ని పందికొక్కుల్లా తిన్న చరిత్ర టీడీపీ హయాంలో జరిగిందన్నారు. అనంతరం వార్డులోని సచివాలయాన్ని తనిఖీ చేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులైన పేదలందరికీ పార్టీలకతీతంగా పథకాలు అందించాలన్నారు. ఎక్కడైనా సచివాలయ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ పెణుజూరు నాగరాజు, వార్డు కౌన్సిలర్ కుండా చౌడయ్య, వార్డు ఇన్‌చార్జ్ కుండా మీనాక్షయ్య, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, నాయకులు గోరకాటి పురుషోత్తం రెడ్డి, కాళంగి శీన, బడన్నపల్లి నరసింహులు, గజ్జల శివ, తొండమాల రవి, ఉడుముల రాము, రాయపాటి రామకృష్ణ, జాకీర్, కత్తె పెద్దన్న, హాకీ చందు, చెలిమిపెద్దన్న, బడన్నపల్లి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు..

కదిరి అర్బన్: రాష్ట్రంలో కుల, మత, వర్గాలకు అతీతంగా సంక్షేమ పాలన సాగుతోందని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్నం సచివాలయం పరిధిలోని మాచిరెడ్డిపల్లి ,పట్నం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులమత వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నారని చెప్పారు. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు పథకానికి ఓ రేటు నిర్ణయించి ప్రజలను పీడించారని తెలిపారు. సంక్షేమ పథకాలు అందించాము కాబట్టే నేడు ధైర్యంగా ప్రతి గడపకు వెళ్తున్నామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు పొందాలని సూచించారు.

ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలు..

తమ గ్రామంలో కొన్ని చోట్ల సీసీ రోడ్డు వేయాలని మాచిరెడ్డిపల్లి, పట్నం గ్రామస్తులు కోరగా వెంటనే అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అలాగే కొన్ని చోట్ల విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. సత్వరం స్తంభాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారి నుంచి పట్నం గ్రామం వరకూ రూ.60 లక్షల అంచనాతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. గతంలో రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెప్పడంతో సీసీ రోడ్డు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరిత గతిన రోడ్డు నిర్మించి.. ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, పట్నం సర్పంచ్ చలపతి నాయక్, మండల కన్వీనర్ ప్రకాష్, వాల్మీకి విద్యాసంస్థల అధినేత అనిల్ కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనంద్‌నాయక్, అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా మెంబర్ సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచులు పట్నం గంగిరెడ్డి, ఇంద్రప్రసాద్ రెడ్డి, ఎస్ఆర్ఐ విద్యాసంస్థల చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామాంజినేయులు, వీరాంజి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సొంతింటి కల సాకారం



గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: సంక్షేమ పథకాల అమలులో సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తాడిపత్రి రోడ్డుకు ప్రధాన రహదారి ప్రక్కన ఉనన జగనన్న కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు షరాబ్ యోగానందాచారీ, భవానీ దంపతులు నిర్మించుకున్న గృహాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం లక్షలాది మంది నిరుపేదలకు నివేశ స్థలాలు అందజేస్తోందన్నారు. గృహాలను నిర్మించడంతో పేదల కల సాకారం అయిందని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, జెడ్పీటీసీ కోటి సుధ, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, కమతం ఈశ్వరయ్య, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్ మల్లికార్జున సేవలు అమూల్యం



మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను సత్కరించిన ఉద్యోగులు

ధర్మవరం: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తూ అందరి మన్ననలు పొంది మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సేవలు మరువలేనివని తాత్కాలిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ పెణుజూరు నాగరాజు, ఎన్జీఓ సంఘం నాయకుడు భాస్కర్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధర్మవరం నుంచి గుంతకల్లు మున్సిపాలిటీకి బదిలీపై వెళ్తున్న కమిషనర్ మల్లికార్జునను సత్కరించారు. మూడేళ్ల పాటు ధర్మవరం మున్సిపాలిటీలో మల్లికార్జున అందించిన సేవలు మరువలేనివన్నారు. ముఖ్యంగా కరోనా వంటి కష్టకాలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి పారిశుధ్య చర్యలు చేపడుతూ కరోనా రోగులకు సేవలందించారని తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, ఆర్ఓ ఆనంద్, పట్టణ సచివాలయాల కన్వీనర్లు మాసపల్లి సాయికుమార్, చందమూరి నారాయణరెడ్డి, ఎన్జీఓ నేతలు భాస్కర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటు



రామాంజనేయులు వెంకటేష్ సంజిదా భాను



బాబ్జాన్ హరినాథ్ రెడ్డి శ్రీనివాస రెడ్డి సుగంధర్ నాయక్

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీకి వెన్నెముకగా నిలిచిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఓడీ చెరువు మండలానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, రైతు, యువత, మహిళా సంఘాల అనుబంధ సంఘాలకు కమిటీలు ఏర్పాటు చేశారు. ఒక్కో సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులుగా 23 మందిని ఎంపిక చేశారు. ఎస్సీ అనుబంధ కమిటీ అధ్యక్షుడిగా ఇనగలూరు రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా తంగేడుకుంట వీరప్ప, కొండకమర్ల ఆంజనేయులును ఎంపిక చేశారు. ఎస్టీ విభాగం కమిటీ అధ్యక్షుడిగా కొండకమర్ల సుగంధర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా కొండకమర్ల రమేష్‌నాయక్, తిప్పేపల్లి బాలునాయక్ ఎంపికయ్యారు. మైనార్టీ విభాగం కమిటీ అధ్యక్షుడిగా ఓడీసీ బాబ్జాన్, ఉపాధ్యక్షులుగా ఓడీసీ హిదాయితుల్లా, కొండకమర్ల అబ్జల్‌ఖాన్‌ను ఎంపిక చేశారు. బీసీ విభాగం కమిటీ అధ్యక్షుడిగా తంగేడుకుంట వెంకటేష్, ఉపాధ్యక్షులుగా వెంకటాపురం శివరాం నాయుడు, మిట్టపల్లి నాగరాజు ఎంపికయ్యారు. రైతు విభాగ కమిటీ అధ్యక్షుడిగా అల్లాపల్లి శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యక్షులుగా తంగేడుకుంట నరసింహారెడ్డి, చింతమానుపల్లి సూరిబాబు నాయుడు ఎంపికయ్యారు. యూత్ విభాగం కమిటీ అధ్యక్షుడిగా సున్నంపల్లి హరినాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా డబురువారిపల్లి సుదర్శన్‌రెడ్డి, కొండకమర్ల సురేష్‌నాయక్‌ను ఎంపిక చేశారు. మహిళా విభాగం కమిటీ అధ్యక్షురాలిగా కొండకమర్ల సజ్జిదాభాను, ఉపాధ్యక్షురాళ్లుగా డబురువారిపల్లి చంద్రకళ, ఓడీసీ రత్నమ్మ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డికి నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కనగానపల్లిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, రైతులు

కనగానపల్లి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు మారుతీ ప్రసాద్, మండల అగ్రి బోర్డు చైర్మన్ వెంకటరాముడు తెలిపారు. శుక్రవారం వైఎస్సార్ రైతు భరోసా నిధులు విడుదల సందర్భంగా మండల కేంద్రంలో మండల ప్రజాప్రతినిధులతో కలసి రైతులు సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుర్లపల్లి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు గంగులు సుధీర్‌రెడ్డి, అంకే రామకృష్ణ, రమణారెడ్డి, మురళీ, నారాయణరెడ్డి, అనిల్, శ్రీకాంత్, రామ్మోహన్, శ్రీనివాసులు, మాధవరాజులు, చంద్రా, హరి పాల్గొన్నారు.

రామగిరి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ మాట్లాడారు. చెప్పిన మాట ప్రకారం రైతులకు రైతుభరోసా అందించిన నాయకుడు సీఎం జగన్ అన్నారు.

పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

కదిరి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహానికి విచ్చేసిన ఆయన్ను వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తన గెలుపునకు కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి బలోపేతం చేశారని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి పలువురు ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు రమణారెడ్డి, ఇంద్రప్రసాద్, శివయ్య, రఘునాథ్‌రెడ్డి, నాగేంద్ర, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాస రెడ్డి, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి: బుక్కపట్నంలోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బషీరున్నీసా శుక్రవారం పేర్కొన్నారు. పాఠశాలలో 1, 4, 6, 7, 9 తరగతిలో మొత్తం ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కేటగిరీల వారీగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

ధర్మవరం: పట్టణంలోని 1వ వార్డుకు చెందిన ఉమ్మడి వెంకటేష్ గత నెల 23వ తేదీన పోతుకుంట గ్రామంలోని బావిలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ మృతుడి కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయం అదించారు.

8న బత్తలపల్లి ఎంపీపీ ఎన్నిక

బత్తలపల్లి: బత్తలపల్లి ఎంపీపీ ఎన్నికకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈనెల 8వ తేదీన గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో అధ్యక్ష స్థానానికి ఎన్నిక నిర్వహిస్తామన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు. ఎంపీడీఓ శ్రీదేవి పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నల్లమాడ: స్థానిక పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి కేసుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ వలీబాషా పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

ధర్మవరం రూరల్: ఆస్తి పంపకాల్లో విభేదాలు రావడంతో కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన దివిటి సోమశేఖర్ అనే వ్యక్తిపై బంధువులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. దివిటి సోమశేఖర్ బంధువులు ధర్మవరం మండలం పోతుకుంటలో నివసిస్తున్నారు. శుక్రవారం సోమశేఖర్ తండ్రితో కలసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆస్తి పంపకాల విషయంలో మాటామాటా పెరిగడంతో కొండయ్య, రఘు కట్టెలతో సోమశేఖర్‌పై దాడి చేశారు. గాయపడిన అతడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జాతీయ రహదారిపై మినీ ట్రక్కు, కారు బోల్తా

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం మినీ ట్రక్కు, కారు బోల్తా పడ్డాయి. స్థానికులు తెలిపిన మేరకు.. టమాటా సాస్ బాటిళ్ల లోడుతో బెంగళూరు నుంచి అనంతపురానికి వెళ్తున్న మినీ ట్రక్కు టైరు పగిలి, అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాహన డ్రైవర్ పవన్‌కుమార్ స్వల్పగాయాలయ్యాయి. ట్రక్కులో ఉన్న బాటిళ్లు కొన్ని పగిలిపోయాయి. ఇక దీనికి సమీపంలోనే జాతీయ రహదారిపై మరోచోట వద్ద బెంగళూరు నుంచి అనంతపురానికి వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. రహదారి పక్కన ఆరుడుగుల లోతు ఉన్న గుంతలోకి కారు పడింది. అయితే అందులో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడ్డారు.

క్రికెట్ టోర్నీ విజేత బత్తలపల్లి

బత్తలపల్లి: మండల కేంద్రంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఫ్రెండ్స్ లెవన్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో బత్తలపల్లి జట్టు విజేతగా నిలిచింది. విజేతకు బత్తలపల్లి మాజీ ఎంపీపీ జక్కంపూటి సత్యనారాయణ ట్రోఫీతో పాటు రూ.55,555 నగదు అందజేశారు. రన్నరప్ గంటాపురం జట్టుకు రూ.22,222 నగదు, ట్రోఫీ అందజేశారు. లక్ష్మానాయుడు, సుధీర్, నాగభూషణ, అప్పస్వామి, చిరంజీవి, రంగానాయుడు, రాజీవ్, ప్రమోద్, ఓబులనాయుడు, జగ్గు, రామకృష్ణ, శ్రీనివాస్‌చౌదరి, సతీష్, చౌదరి పాల్గొన్నారు.

ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి

ఓడీ చెరువు: గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి భూములు కోల్పోయిన తమకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. గోరంట్ల మండలంలోని పక్క గ్రామాలకు ఎకరాకు రూ.17 లక్షలు చెల్లించారన్నారు. తమకు కూడా ఎకరాకు రూ. 20 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. లేదా పక్కన భూములు కొని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు ప్రసాద్‌రెడ్డి, ప్రభాకర్, ప్రసాద్‌నాయక్, చిన్నప్పయ్య, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో బేల్దారికి తీవ్ర గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురం మేడాపురం క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని బేల్దారికి తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కత్తేకొట్టాలకు చెందిన బేల్దారి పెద్దన్న పట్టణంలో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళ్తుండగా.. మేడాపురం క్రాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో పెద్దన్నకు తీవ్రగాయాలు అయ్యాయి. వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

8న మండల కో–ఆప్షన్ సభ్యుడి ఎన్నిక

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 8వ తేదిన మండల కో–ఆప్షన్ సభ్యుడి ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పూల నరసింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు కో–ఆప్షన్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లను 10 గంటల్లోపు ఎన్నికల అధికారికి అందజేయాలన్నారు. 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. కో–ఆప్షన్ సభ్యుడిగా ఉన్న ముస్తఫా (బాబు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.

క్యాషియర్‌కు తీవ్ర గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రియాంక నగర్‌కు చెందిన బ్యాంకు క్యాషియర్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మంపల్లి గ్రామంలోని కెనరా బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్న నవీన్ కుమార్‌రెడ్డి.. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ప్రియాంక నగర్ నుంచి తిమ్మంపల్లికి బయలుదేరాడు. పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద ముందు వైపు వెళుతున్న మినరల్ వాటర్ వ్యాన్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో.. నవీన్ కుమార్‌రెడ్డి వ్యాన్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో గాయపడిన అతడ్ని ధర్మవరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎన్‌పీకుంట: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే ప్రతి విద్యార్థికి 'జగనన్న విద్యా కానుక' కిట్లను అందిస్తామని ఎంపీడీఓ ఆదినారాయణ పేర్కొన్నారు. ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్న విద్యా కానుక కిట్లను శుక్రవారం పరిశీలించారు. షూ, యూనిఫాం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నీటి సమస్య పరిష్కారం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఓసీ కాలనీ, శ్రీసత్యసాయి కాలనీల్లో నెల కొన్న తాగునీటి సమస్యను శుక్రవారం జెడ్పీటీసీ కోటి సుధ పరిష్కరించారు. గతంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు విన్నవించారు. స్పందించిన జెడ్పీటీసీ శుక్రవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. కుళాయిల వద్ద పూజలు చేసి, నీటి సరఫరాను ప్రారంభించారు.